



సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

## విజయానికి పట్టభద్రులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గౌడ్ విజయానికి పట్టభద్రులందరూ సహకరించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కోరారు. బుధవారం స్థానిక పట్టణంలోని అతిథి హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతం త్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణగౌడ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ గౌడ్ క్రమ సంఖ్య-3కు మొదటి ప్రాధాన్యత కింద నియోజకవర్గంలోని పట్టభద్రులు తమ ఓటు వేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, తట్టు నారాయణ, సంజీవ్‌రెడ్డి, వెంకటేశం, నర్సింహగౌడ్, ప్రవీణ్ కుమార్, ప్రభు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటీహెచ్-స్విన్‌బర్న్ సంయుక్తంగా

## టెక్నాలజీ పురోగతి పరిశోధనలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, స్విన్‌బర్న్ డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ కరెన్ హాప్‌గుడ్

కంది, ఫిబ్రవరి 26 : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్-ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీలు సంయుక్తంగా కమ్యూనికేషన్ టెక్నాలజీలలో పురోగతి పరిశోధనలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్‌లో స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ఏర్పాటు చేసిన (ఎస్ఐఎంఎంఈసిటీ) పరిశోధన కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. సర్ఫేస్ కోటింగ్, సంకలిత-డిజిటల్ తయారీ, డీకార్బొనైజేషన్, క్రిమినల్ మినరల్స్, ఇ-వేస్ట్ రీసైక్లింగ్, 6జీ, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సార్లలో పరిశోధనను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉమ్మడి పరిశోధనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్, ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్ స్విన్‌బర్న్ మధ్య దీర్ఘకాలిక సహకారం కోసం స్థిరమైన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు కానుందన్నారు. దృశ్యమానత, ఆవిష్కరణ అవుట్‌పుట్, పరిశ్రమ, సమాజానికి వాస్తవ-ప్రపంచ సహకారాలను మెరుగుపరుస్తుందన్నారు. పరిశోధన ఫలితాలు ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషించనున్నట్లు పేర్కొన్నారు. ఐఐటీహెచ్, స్విన్‌బర్న్ 2017 నుంచి జాయింట్ డాక్టోరల్ ప్రోగ్రామ్ (జేడీపీ)ని చురుకుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 39 మంది స్కాలర్లు జేడీపీని పూర్తి చేశారని, ప్రస్తుతం 32 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఈ రెండు సంస్థల మధ్య బలమైన సంబంధాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. స్విన్‌బర్న్ డిప్యూటీ వైస్-చాన్సలర్ (పరిశోధన) ప్రొఫెసర్ కరెన్ హాప్‌గుడ్ మాట్లాడుతూ ఐఐటీహెచ్‌తో భాగస్వామ్యం ఇప్పటికే ఉమ్మడి పరిశోధనలు, పీహెచ్‌డీ శిక్షణలో అద్భుతమైన ఫలితాలు సాధించామని, ప్రపంచ స్థాయిలో సంచలనాత్మక పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు నాంది కానుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం



మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న శ్రీరామ్ నగర్ కాలనీవాసులు

జిన్నారం ఫిబ్రవరి 26 : జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని 10వార్డు శ్రీరామ్ నగర్ కాలనీ వాసులు మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శైలజ పుండరీకం ఆధ్వర్యంలో జరిగిన సన్మానసభలో జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి లతోపాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, మాజీ కౌన్సిలర్లను సన్మానించారు. కాలనీ అభివృద్ధిలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకుల సహకారం మరువలేనిదని మాజీ కౌన్సిలర్ శైలజ పుండరీకం హర్షం వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్లు హనుమంత్ రెడ్డి, సంధ్యా జైపాల్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యా దవ్, సరిత శ్రీకాంత్ రెడ్డి, బీరప్ప యాదవ్, ప్రభు నాయక్, సతీశ్, మాజీ ఎంపీటీసీ రత్నం, మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా ఖ్వాజా ఉర్సు

### దర్గాను దర్శించుకొని గంధం సమర్పించిన మంత్రి దామోదర రాజనర్సింహా



వట్‌పల్లి వెంకట్ ఖ్వాజా దర్గాలో గంధం సమర్పిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

వట్‌పల్లి, ఫిబ్రవరి 26 : కులమతాలకు అతీతంగా జరిగే వెంకట్ ఖ్వాజా ఆశ్రమం(దర్గా) 39వ ఆరాధన మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వట్‌పల్లి మండల కేంద్రంలోని వెంకట్ ఖ్వాజా దర్గా ఉర్సులో భాగంగా బుధవారం అప్పాగారి (దర్గా)లో వేలాది భక్తులు గం ధాలు సమర్పించారు. మం త్రి దామోదర రాజనర్సింహ గంధం సమ ర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ కమిటీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- జహీరాబాద్ తహసీల్ ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ
- ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి



జహీరాబాద్ తహసీల్ నుంచి ఎన్నికల అధికారులు సామగ్రితో వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని తహసీల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పీవో, ఏపీవో, ఓపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచించారు. జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, న్యాల్‌కల్, జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల్లో ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు దాదాపు 90 మంది వరకు అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆయా మండలాల పరిధిలోని 4,544 మంది పట్టభద్రులు, 509 మంది ఉపాధ్యాయులకు సంబంధించి ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోని ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎన్నికల నిర్వాహణకు అవసరమైన సామగ్రిని సంబంధిత అధికారులకు పంపిణీ చేశారు. ఎన్నికల సామగ్రితో అధికారులు, సిబ్బంది ఆయా మండలాల పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ప్రత్యేక బస్సులను ట్రైనీ కలెక్టర్ మనోజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంత వాతావరణలో జరిగేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, పట్టణ ఎస్సై కాశీనాథ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో..





సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల సిబ్బంది , ఆయా కేంద్రాలకు బస్సులో తరలివెళ్తున్న సిబ్బంది



అందోల్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

## భక్తులతో కిక్కిరిసిన కేతకీ



గర్భ గుడిలో స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



అదృష్ట లింగాన్ని ఎత్తుతున్న జడ్జి భవానీ చంద్ర

ఝరాసంగం, ఫిబ్రవరి 26 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే దేవాలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

కేతకీ సంగమేశ్వరాలయంలో జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జిల్లా సివిల్ కోర్టు జడ్జి భవానీ చంద్ర, జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌లు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర



జాతరకు భారీగాతరలివచ్చిన ప్రజలు

అమీన్‌పూర్ ఫిబ్రవరి 26 : మహా శివరాత్రిని పురస్కరించుకొని బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. బుధవారం తెల్లావారుజామునే నిత్యపూజల్లో భాగంగా మహన్యాసక పూర్వక ఏకదాశ రుద్రాభిషేకం నిర్వహించారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి,సీఐ నరేశ్ అధ్వర్యంలో జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు,నాయకులు దర్శించుకున్నారు.



నారాయణఖేడ్ : మహా శివరాత్రి సందర్భంగా ఖేడ్‌లో కాశీనాథ్ మందిర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## శివశివ శంకర..

**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా శివాలయాలు కిటకిటలాడాయి. భక్తి శ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు,శివలింగానికి, దేవతామూర్తులకు క్షీరాభిషేకం చేసి దర్శించుకున్నారు.**

*-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 26*



ఆర్సీపురంలో మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి



గుమ్మడిదల: సుక్కగట్టు వీరభద్రస్వామివారికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డి



సంగారెడ్డి కలెక్టరేట్ : విద్యాపీఠంలో 18.6 అడుగులతో తయారు చేసిన కోటి రుద్రాక్ష శివ లింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు





సంగారెడ్డిలో బారులు తీరి భక్తులు, శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

### ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్


## ప్రక్రియ పరిశీలన

సిద్దిపేట, ఫిబ్రవరి 26 : మెదక్-కరీంనగర్-నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టబద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రక్రియలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల వారీగా సెక్టార్, ఫ్రీసెండింగ్, అదనపు ఫ్రీసెండింగ్ అధికారులందరూ అందజేసిన పోలింగ్ మెటీరియల్‌ను క్షుణ్ణంగా చెక్ చేసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన ఇక్కడే మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, ఆయా మండల తహసీల్దార్లు, అధికారులు, పాల్గొన్నారు.

**మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్**

మెదక్-కరీంనగర్-నిజామాబాద్-అదిలాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పరిశీలకులు బెన్హర్ మహేశ్ కుమార్ దత్త ఎక్కాను సిద్దిపేట హరిత మినర్వా హోటల్‌లో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాసన మండలి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని శాసనమండలి ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్‌కు సూచించారు.

## ఖమ్మంపల్లిలో ఎక్కడి చెత్త అక్కడే..



ఖమ్మంపల్లిలో చెత్తతో నిండిన కాల్వ

మునిపల్లి, ఫిబ్రవరి 26 : గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అయినప్పటి నుంచి నేటి వరకు అధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామాల్లో అధికారులు సరైనా పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది. మండలంలోని ఖమ్మంపల్లిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక గ్రామంలోని మురుగు కాల్వల్లో చెత్తచెదారం నిండి ఖమ్మంపల్లిలో కంపు కొడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శిపై పలు సమస్యలపై గ్రామస్తులు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటుపై సమీక్ష

రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రామాలయం, శివాలయం, సరస్వతీదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు విషయమై ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ పూజారి బాలకృష్ణ ముహూర్తం ఖరారు చేశారు. దీనికి గ్రామస్తులందరూ అంగీకరించారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# బడి ఉంటేనే బస్సు

- దెబ్బ తిన్న ప్రధాన రోడ్డు
- పట్టించుకోని అధికారులు



బడంపేట-మనియార్‌పల్లి మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

కోహీర్, ఫిబ్రవరి 26 : మారుమూల పల్లెలకు కూడా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. కేవలం పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతున్న రోజుల్లో ఆర్టీసీ బస్సు కనిపిస్తుంది. లేకుంటే ఆర్టీసీ బస్సు అంటే అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి మండలంలోని పలు గ్రామాలకు బస్సులను నడిపిస్తున్నది. కానీ రోడ్లు దెబ్బతినడంతో బస్సుల సంఖ్యను తగ్గించారు. రోడ్లన్నీ గుంతలమయం కావడంతో వాటిని తాత్కాలికంగా రద్దు చేశారు. జహీరాబాద్ నుంచి శేఖాపూర్ మీదుగా పర్సపల్లి, బడంపేట, మనియార్‌పల్లి వరకు నడిపే బస్సును మధ్యాహ్నం రద్దు చేశారు. సెలవుల్లో అయితే అటువైపునకు ఒక్క బస్సు కూడా రాదంటే అతిశయోక్తి కాదు. బడంపేట గ్రామం మీదుగా రద్దు చేయడంతో మనియార్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రయాణికులు కవేలి, కోహీర్ మీదుగా వెళ్తున్నారు. దీంతో అదనంగా పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నది. తద్వారా ప్రయాణికులకు ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా అవుతున్నది. బడంపేట వైపునకు ప్రతిరోజు ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

### పది కిలోమీటర్లు ఎక్కువ అవుతున్నది..



జహీరాబాద్ నుంచి బడంపేట, మనియార్‌పల్లి ఆర్టీసీ ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ, స్కూళ్లు ఉన్నప్పుడు మాత్రమే బస్సులను నడిపిస్తున్నారు. బస్సులు రాకపోవడంతో కవేలి, కోహీర్, బిలాల్‌పూర్ నుంచి మనియార్‌పల్లికి వస్తున్నాం. దీంతో పది కిలోమీటర్లు ఎక్కువగా అవుతున్నది. బస్సులు ఎప్పటికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**-బాలమణి, అంగన్‌వాడీ టీచర్, మనియార్‌పల్లి**

### రోడ్డును బాగు చేయాలి..



నేను కొంత కాలం నుంచి చూస్తున్నా. బడంపేట నుంచి మనియార్‌పల్లి వరకు ఉన్న రోడ్డును ఇంత వరకు మరమ్మతులు చేయలేదు. రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు కొంత రోడ్డు కొట్టుకుపోయింది. మరోసారి కొత్త రోడ్డు నిర్మించి ఆర్టీసీ బస్సులను నిరంతరంగా నడిపించాలి.

**- సత్యనారాయణరెడ్డి, మనియార్‌పల్లి**